
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

బుధవారం 12 నవంబరు 2025



రేబర్తిలో అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

అందెశ్రీకి రేబర్తి నివాళి

మద్దూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ వాగ్గేయ కారుడు, కవి, రచయిత, దివికేగిన అందె ఎల్లయ్య అలియాస్ అందెశ్రీ విగ్రహం ఏర్పాటుకు ఆయన స్వగ్రామం రేబర్తి వాసులు సిద్ధమవుతున్నారు. మంగళవారం హైదరాబాద్‌లో అందెశ్రీ అంత్యక్రియలు పూర్తయిన అనంతరం ఆయనకు రేబర్తి గ్రామచౌరస్తాలో, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చిత్రపటానికి గ్రామస్థులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ... గ్రామంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి హామీ పొంది, రేపటి తరం విద్యార్థుల విద్యాభివృద్ధికి అందెశ్రీ కృషి చేశారన్నారు. తమ గ్రామ ఆణిముత్యానికి గ్రామస్థుల సహకారంతో విగ్రహ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు జక్కిరెడ్డి సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రేబర్తి గ్రామాన్ని సందర్శించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మఠం భద్రయ్య, బాలమల్లు, గంపల కృష్ణారెడ్డి, నల్ల బాల్‌రెడ్డి, బొమ్మ అయిలయ్య, లింగారెడ్డి, పంచాయతీ సెక్రటరీ మాధవ్ జాదవ్‌తో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం

భోజనం అందించాలి

- కలెక్టర్ హైమావతి



వంటిమామిడిలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ములుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా, మెనూ ప్రకారం అందించాలని కలెక్టర్ హైమావతి అన్నారు. మంగళవారం ములుగు మండలం క్షీరసాగర్, వంటిమామిడి ప్రభుత్వ పాఠశాలలను ఆమె సందర్శించారు. వంటగదికి వెళ్లి మధ్యాహ్న భోజన ప్రక్రియను పరిశీలిస్తూ... రోజూ మెనూ ప్రకారం రుచికరంగా వంటలను అందించాలని సూచించారు. వంటగది పరిసరాలు ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని వంట సిబ్బందిని ఆదేశించారు. తరగతి గదికి వెళ్లి కాసేపు విద్యార్థులను పలకరించారు. అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని, సమయం వృథా చేయకుండా ఒక లక్ష్యం పెట్టుకొని చదవాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విధంగా కృషి చేయాలని కోరారు.

క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి

- సీపీ విజయ్ కుమార్



మాట్లాడుతున్న సీపీ విజయ్

కొండపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని సిద్దిపేట సీపీ విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం కొండపాకలోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ రెసిడెన్షియల్ కళాశాల ఆవరణలో ఉమ్మడి మెదక్ జిల్లా అండర్ 14, అండర్ 19 క్రీడలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రీడల్లో రాణిస్తేనే జీవితంలో కూడా రాణించగలుగుతారన్నారు. ఆటల్లో గెలుపు ఓటములు సహజమని, ఆడే ప్రతి ఒక్కరినీ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ హెడ్ శ్రీనివాస్ గౌడ్, జిల్లా కోఆర్డినేటర్ గోపాల్ రెడ్డి, మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, శ్రీలత పాల్గొన్నారు.

సమ్మెబాటలో 1962 పశు ఆరోగ్యసేవ

అంబులెన్స్ సిబ్బంది



1962 అంబులెన్స్ సిబ్బంది

గజ్వేల్, నవంబరు11(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు వైద్యం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం-ఈఎంఆర్ఐ సమన్వయంతో ఏర్పాటు చేసిన 1962 అంబులెన్స్ సిబ్బంది సమ్మె బాట పట్టనున్నారు. వెటర్నరీ డాక్టర్, ప్యారవేట్, డ్రైవర్, అటెండర్ ఈ1962 అంబులెన్స్‌లలో విధులు నిర్వహిస్తుంటారు. చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న వీరికి నాలుగు నెలలుగా జీతాలు లేక కుటుంబ పోషణ, పిల్లల చదువులు, అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పలుమార్లు ప్రభుత్వానికి, కంపెనీకి విన్నవించినా ఫలితం లేదని గజ్వేల్ నియోజకవర్గ 1962 అంబులెన్స్ సిబ్బంది డాక్టర్ శ్రీలత, ప్యారవేట్ సిబ్బంది మానస, డ్రైవర్ కన్నారెడ్డి, అటెండర్ మహేందర్ తెలిపారు. సమస్యల పరిష్కారానికి సమ్మె చేపట్టనున్నట్లు చెప్పారు.

నాచగిరి క్షేత్రంలో దీపారాధన



నాచగిరి లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం దీపారాధన నిర్వహించారు. ఓంకారం ఆకారంలో ఏర్పాటు చేసిన కార్తీక దీపాలను భక్తులు వెలిగించి దీపారాధన చేశారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్తా ఆలయ కార్యనిర్వహణాధికారి విజయ రామారావు పర్యవేక్షణలో కార్తీక దీపారాధన కార్యక్రమం నిర్వహించారు.

వర్గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి)

కట్టడి ఏదీ?



ఉమ్మడి జిల్లాలో విజృంభిస్తున్న కుక్కలు

- పది నెలల్లో 5,500 మందిపై దాడి
- సుప్రీంకోర్టు హెచ్చరించినా కదలిక కరువు
- వీధి కుక్కల గణనతోనే సరిపెట్టిన అధికారులు
- కానరాని బర్త్‌కంట్రోల్ చర్యలు

జిల్లా	కుక్కల సంఖ్య	2025లో కుక్కకాట్లు
సిద్దిపేట	47,568	1,730
సంగారెడ్డి	62,775	1,962
మెదక్	25,000	2020

జనసంచార ప్రాంతాల్లో కుక్కల విహారాన్ని నియంత్రించాలని ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం సూచనలు చేసింది. దీంతో అందరి దృష్టి కుక్కలపైకి మళ్లింది. కుక్కలను స్వేచ్ఛగా వదలడంతో మనుషులను గాయపరుస్తున్న సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో కుక్కల కారణంగా ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి కూడా ఉంది. ఇక గాయపడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉంది. గతంలో కుక్కల సంఖ్యను లెక్కించినప్పటికీ తాజాగా సుప్రీంకోర్టు ఆదేశాలతో మరోసారి అధికార యంత్రాంగం దృష్టి సారించినట్లుగా తెలుస్తోంది.

సంగారెడ్డి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో కుక్కల దాడి సంఘటన లేని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. ప్రతీరోజు ఏదో ఒకచోట ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. వీధికుక్కల నియంత్రించడానికి యానిమల్ బర్త్ కంట్రోల్ ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ పూర్తిస్థాయి ఆచరణ సాధ్యం కావడం లేదు. కుక్కల కారణంగా మనుషులు చనిపోవడం, గాయాలపాలైన సంఘటనలు గతంలో అనేకం ఉన్నాయి. అలాగే, పలుచోట్ల కుక్కలను చంపడం వల్ల బాధ్యులపై కేసులూ నమోదయ్యాయి. దీంతో కుక్కల జోలికి వెళ్లాలంటేనే అధికారులు, స్థానికులు జంకుతున్నారు. దీంతో కుక్కల జనన నియంత్రణ ఒక్కటే ఆధారమైంది. కుక్కల సంఖ్య విపరీతంగా ఉండడంతో ఈ ప్రక్రియ ఆచరణలో సాధ్యం కావడంలేదు. వీధికుక్కల సమస్యపై ఇటీవల సుప్రీంకోర్టు పలు సూచనలు చేసింది. జనసంచార ప్రాంతాల్లో కుక్కల జనన నియంత్రణ చేపట్టాలని హెచ్చరించింది. ఈక్రమంలో జిల్లాల్లో అధికారులు మరోసారి దీనిపై దృష్టిపెట్టారు.

లెక్కలతోనే సరి

ఏడాది క్రితం కుక్కకాట్లను అరికట్టడానికి అధికారులంతా ఉమ్మడి మెదక్ జిల్లాలోని గ్రామాలు, పట్టణాల్లో సర్వే చేశారు. యానిమల్ బర్త్‌కంట్రోల్ సెంటర్లలో జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని నిర్ణయించారు. హడావిడిగా కుక్కలను లెక్కించినా జనన నియంత్రణపై చేతులెత్తేశారు. లెక్కలతోనే సరిపెట్టారే తప్ప ఒక్క అడుగు కూడా మిగతా 7వ పేజీలో





పెచ్చులూడిన కోర్టు భవనం

- కేసు విచారణ జరుగుతుండగా ఘటన
- అక్కడెవరూ లేక తప్పిన ప్రమాదం

గజ్వేల్‌రూరల్, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): ఓ కేసు విచారణ జరుగుతుండగా, కోర్టు భవనం పెచ్చులూడి కింద పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ అడిషల్ కోర్టులో మంగళవారం ఓ కేసు విచారణ జరుగుతున్న సమయంలో కోర్టు హాలు పైకప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. పురాతన భవనం కావడంతో దాని స్థానంలో నూతన భవనం నిర్మిస్తుండగా, పాత భవనంలోనే విచారణలు జరుగుతున్నాయి. మంగళవారం ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఎక్కువ మంది లేకపోవడంతో ఎవరికీ ఏమీ కాలేదు. దీంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఈ నేపథ్యంలో నూతనంగా నిర్మిస్తున్న కోర్టు భవనాన్ని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.





హుస్నాబాద్-కరీంనగర్ రోడ్డు సెయింట్ జోసెఫ్ స్కూల్ వద్ద ప్రమాదకరంగా గుంత

గుంతలు..గతుకులు

- ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా రోడ్లు
- గుంతలమయమైన రహదారులు.. కోతకు గురై గోతులు
- కనీసం మరమ్మతుకు నోచుకోని వైనం

7

50 ఫీట్ల ప్రామాణికంపై పక్షపాతం!

- చేర్యాల పట్టణంలో వివాదాస్పదంగా జాతీయ రహదారి విస్తరణ పనులు
- బడాబాబుల భవనాలకు మినహాయింపుపై అనుమానాలు
- కూల్చివేతలు కొందరికేనా అని ప్రశ్నిస్తున్న స్థానికులు



మార్కింగ్ చేయడంతో స్వతహాగా కూలీలతో భవనాలు కూల్చివేస్తున్న దృశ్యం

చేర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట-సిరిసిల్ల జాతీయ రహదారి-365బీ విస్తరణ పనులు చేర్యాలలో వివాదాస్పదంగా మారుతున్నాయి. రహదారికి ఇరువైపులా 50 ఫీట్ల ప్రామాణికతతో భవనాలను కూల్చివేయాలని మార్కింగ్ చేసినప్పటికీ, కొందరు యజమానుల పట్ల ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్ పక్షపాత ధోరణి ప్రదర్శిస్తున్నారనే ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఎక్స్‌కవేటర్‌తో హడావిడి చేయడంతో భయపడి పేద, మధ్య తరగతి భవన యజమానులు స్వయంగా తమ నిర్మాణాలను కూల్చివేసుకోగా, బడాబాబుల షాపింగ్‌మాల్స్ మాత్రం నేటికీ యథావిధిగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది.

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 45 ఫీట్ల వరకు డ్రెయిన్, రోడ్డు, అలాగే విద్యుత్ స్తంభాలు, తాగునీటి పైప్‌లైన్, చెట్ల పెంపకానికి మరో 5 ఫీట్ల స్థలం కలిపి మొత్తంగా 50 ఫీట్ల లోపు గల నిర్మాణాలను తొలగించాలని మార్కింగ్ చేశారు. దీంతో పలు భవనాలు పాక్షికంగా, మరికొన్ని సగానికిపైగా కూల్చివేయాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే, రోడ్డు, డ్రెయిన్ నిర్మాణం, భవనాల కూల్చివేతల విషయంలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్‌హెచ్ అధికారులు, కాంట్రాక్టర్ ఇష్టానుసారం వ్యవహరించడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇక డెయిన్ పనులు చేపట్టినప్పుడు ఒక ప్రదేశంలో 45 ఫీట్లు, మరో ప్రదేశంలో 40 ఫీట్ల లోపు చేపట్టడమే కాకుండా ఎత్తుపల్లాలు పరిగణించకుండానే పూర్తి చేశారు. డబ్బు తీసుకుని ప్రామాణికత పాటించలేదని పలువురు బహిరంగ ఆరోపిస్తున్నారు. బీటీ రోడ్డు, పార్కింగ్ టైల్స్ పూర్తిచేసి, డ్రెయిన్ పనులు తుదిదశకు చేరుకున్న వెంటనే కొద్ది రోజుల క్రితం భవనాల కూల్చివేతకు అధికారులు రంగం సిద్ధం చేశారు. మార్కింగ్ చేసిన మేరకు భవనాలు కూల్చివేయకపోతే తామే కూల్చివేస్తామని, ఎక్స్‌కవేటర్‌ను వెంటబెట్టుకుని వచ్చి యజమానులను హెచ్చరించారు. పరిహారం ఇవ్వరని తెలియడంతో, జాప్యం చేస్తే మరింత నష్టం చేకూరుతుందని భయపడి, పేద, మధ్యతరగతి భవన యజమానులు స్వతహాగా ఖర్చులు భరించి మార్కింగ్ ప్రకారం తమ ఇళ్లు, భవనాలను కూల్చివేశారు. ఈ క్రమంలో ఒక్కో యజమాని రూ.2లక్షల నుంచి రూ.10లక్షల వరకు సొంతంగా ఖర్చు పెట్టుకున్నారు.



మార్కింగ్ వేసి కూల్చివేయడంతో పునర్నిర్మాణం చేసుకుంటున్న యజమానులు

బడాబాబులకు మినహాయింపా..?

50 ఫీట్ల మార్కింగ్ లోపు ఉన్న భవనాలలో 90 శాతం మందికిపైగా తమ నిర్మాణాలను కూల్చివేసుకున్నారు. కానీ, మిగతా కొందరు మాత్రం నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. కూల్చివేయని వాటిలో పలువురు బడాబాబుల భవనాలు, షాపింగ్‌మాల్స్ ఉన్నాయి. జాతీయ రహదారి నిర్మాణం విషయంలో అధికారులు, కాంట్రాక్టర్ చిత్తశుద్ధి కనబరిచి నిష్పక్షపాతంగా వ్యవహరిస్తారా, లేక ఉదాసీనతతో వ్యవహరిస్తారా అనేది వేచి చూడాలి.



డ్రెయిన్ నిర్మాణం కోసం కూల్చివేతలు

ఎవరినీ ఉపేక్షించం

రహదారి విస్తరణ కోసం మార్కింగ్ చేసిన మేర 50 ఫీట్లలోపు భవనాల కూల్చివేత విషయంలో ఎవరినీ ఉపేక్షించం స్వతహాగా కూల్చివేత కోసం సమయం కావాలని అడిగినందున అనుమతించాం. అడ్డుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నప్పటికీ ఏం చేయాలన్నది మాకు తెలుసు. ఒకేసారి మిగతా వాటిని తప్పకుండా తొలగిస్తాం.

- రాజారాం, ఎన్‌హెచ్ డీఈఈ

మల్లన్న హుండీ

ఆదాయం రూ.73 లక్షలు

కొమురవెల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ శైవక్షేత్రం కొమురవెల్లి మల్లికార్జునస్వామి హుండీలను ఆలయ మహా మండపంలో మంగళవారం ఈవో టంకశాల వెంకటేష్ ఆధ్వర్యంలో లెక్కించారు. 76 రోజులకు గాను రూ.73,18,504, మిశ్రమ బంగారం 80 గ్రాములు, మిశ్రమ వెండి 4.80 కిలోలు, 21 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్లు ఆలయ కార్యనిర్వహణధికారి తెలిపారు. లెక్కింపులో శివరామ కృష్ణ భజనమండలి సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిద్దిపేట డివిజన్ ఇన్‌స్పెక్టర్ విజయలక్ష్మి, ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని మల్లికార్జున్, ధర్మకర్తలు లింగంపల్లి శ్రీనివాస్, కాయిత మోహన్‌రెడ్డి, మామిడాల లక్ష్మీ, ఆలయ సిబ్బంది, ఎస్‌బీఐ బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మల్లన్న ఆలయంలో కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

హుస్నాబాద్ చెరువులకు కొత్తశోభ!

- సుందరీకరణకు భారీగా నిధులు
- త్వరలో పనులు ప్రారంభం

హుస్నాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్‌లోని చారిత్రక చెరువులకు మహర్దశ పట్టనుంది. కాకతీయుల కాలంలో నిర్మించిన ఈ జలవనరులు అద్భుతమైన అందాలను సంతరించుకోనున్నాయి. ఇప్పటికే ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో సుందరీకరణ పనులకు రంగం సిద్ధమైంది. పట్టణంలోని ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు ఇప్పటికే 50 శాతం పూర్తయ్యాయి. ఆరపల్లి పల్లె చెరువు పనులకు సంబంధించి టెండర్లు పూర్తయ్యాయి. ఇరిగేషన్ (ఐబీ) అధికారుల నుంచి అనుమతులు (ఎన్‌వోసీ) రాగానే పనులు ప్రారంభం కానున్నాయి. కొత్త చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం రూ. 8.50కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఈ నిధులు త్వరలో మంజూరవుతాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. హుస్నాబాద్ పట్టణంలోని ఆరపల్లి పల్లె చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ. 2కోట్లు మంజూరు కాగా, టెండర్ల ప్రక్రియ పూర్తైంది. 29.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ పల్లె చెరువు కింద దాదాపు 200 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ నిధులతో సుందరీకరణ పనులైన బతుకమ్మ ఘాట్, వాకింగ్ ట్రాక్, జిమ్, చెరువులో మైసమ్మ గుడి నిర్మాణం వంటివి చేపట్టనున్నారు. వీటితో పాటు, ఇదే చెరువుకు కేంద్ర ప్రభుత్వం అమృత్ పథకం కింద మరో రూ. 2.30 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువులోకి మురుగు నీరు రాకుండా మళ్లింపు పనులు, కట్ట బలోపేతం, కాలువల మిగతా 8వ పేజీలో



హుస్నాబాద్ పట్టణం ఆరపల్లిలోని పల్లె చెరువు



హుస్నాబాద్ పట్టణంలోని కొత్త చెరువు

పట్టుకున్న మద్యం పారబోత



మద్యాన్ని పారబోస్తున్న పోలీసులు,ఎక్సైజ్ అధికారులు

పటాన్‌చెరు నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో పట్టుబడిన మద్యాన్ని శివారు ప్రాంతంలో పారబోసిన సంఘటన ఐడీఏబొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సమయంలో చేసిన తనిఖీల్లో 25 కేసుల్లో 365లీటర్ల మద్యాన్ని పట్టుకున్నారు. దాన్ని కోర్టు ఆదేశాల మేరకు మంగళవారం శివారు ప్రాంతంలో పారబోసారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఏఈఎస్ మణెమ్మ, సీఐ పరమేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

యువకుడి దుర్మరణం

పటాన్‌చెరు,నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని ఓ యువకుడు దుర్మరణం పాలయిన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అభిమాన్‌సింగ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా మిర్జాపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (30) హైదరాబాద్ హిమాయత్‌నగర్ బషీర్‌బాగ్‌లో ఉంటూ కూలిపని చేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం ఇస్నాపూర్ గురుకుల పాఠశాల ఎదురుగా రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు.

తాళాలు పగలగొట్టి చోరీ

జోగిపేట రూరల్, నవంబర్11 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని దుండగులు దుకాణాల షటర్ల తాళాలు పగలగొట్టి నగదు, విలువైన మొబైల్ ఫోన్‌లను దోచుకెళ్లిన ఘటన సంగారెడ్డి జిల్లా జోగిపేటలో చోటుచేసుకుంది. ఎస్సై పాండు తెలిపిన వివరాల మేరకు... జోగిపేటలోని భగత్‌సింగ్ రోడ్డు పరిధిలో ఉన్న చింతల రాజమల్లయ్య ఫర్టిలైజర్ దుకాణంలో మంగళవారం తెల్లవారుజామున తాళాలు పగలగొట్టిన గుర్తుతెలియని దుండగులు షాప్‌లోకి చొరబడి కౌంటర్‌లోని 15 వేల రూపాయల నగదును అపహరించారు. అంతే కాకుండా దానికి ఎదురుగా ఉన్న ఎ1 మొబైల్ షాప్‌లోని విలువైన మొబైల్ ఫోన్‌లను దోచుకెళ్లారు.

ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రధాన రోడ్లు అడుగడుగునా ప్రమాదాలకు నెలవుగా మారాయి. కొన్నిచోట్ల గుంతల ఏర్పడి ధ్వంసం కాగా, మరికొన్ని చోట్ల కోతకు గురయ్యాయి. కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల రంగారెడ్డి జిల్లా చేవేళ్ల మండలం మీర్జాగూడ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతను తప్పించబోయి ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టడంతో జరిగిన ఘోరప్రమాదం తెలిసిందే. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకముందే అధికారులు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


వెల్దుర్తి- మెదక్ ప్రధాన రహదారిపై గుంతలు


కాళ్లకల్ -ముప్పిరెడ్డిపల్లి రోడ్డు పరిస్థితి..

గుంతలు.. గతుకులు


వెల్దుర్తి- మెదక్ ప్రధాన రహదారిపై ఏర్పడిన గుంతలు


నారాయణఖేడ్ : జాతీయ రహదారిపై ఏర్పడిన గతుకులు

- ఉమ్మడి జిల్లాలో అధ్వానంగా పలు రోడ్లు
- గుంతలమయమైన రహదారులు
- కోతకు గురై గోతులు
- కనీసం మరమ్మతుకు నోచుకోని వైనం
- భయం భయంగా వాహనదారుల ప్రయాణం

వెల్దుర్తి-మెదక్ రోడ్డులో

వెల్దుర్తి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని వెల్దుర్తి- మెదక్ వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమై, ప్రమాదాలకు నెలవుగా మారింది. జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డు అసలే ఇరుకుగా ఉండగా, పెద్ద గుంతలు ఏర్పడడంతో ప్రస్తుతం ప్రయాణం దుర్భరంగా మారింది. ముఖ్యంగా రామాయిపల్లి, ఏదులపల్లి, బండపోసానిపల్లి, శెట్టిపల్లికాలాన్ గ్రామాల ప్రజలు నిత్యం భయం భయంతో ప్రయాణం సాగిస్తున్నారు. ఆ గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నా ప్రభుత్వానికి కనువిప్పు కలగడం లేదు. ఉప్పులింగాపూర్ శివారు హల్దీవాగు బ్రిడ్జి వద్ద, రామాయిపల్లి శివారు బషీర్ చెరువు అలుగు కాలువ వద్ద భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిలపై నీళ్ల ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. దీంతో ప్రయాణికులతో పాటు ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాళ్లకల్-ముప్పిరెడ్డిపల్లి దారిలో..

మనోహరాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామం నుంచి ముప్పిరెడ్డిపల్లి గ్రామం వరకు ఉన్న రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి, కిలో మీటరు వరకు ధ్వంసమైంది. ఈ మార్గంలో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు, స్థానికులు నిత్యం నానా అవస్థలు పడుతున్నారు. గతంలో పలుమార్లు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా, వారు వచ్చి చూసి వెళ్లడం తప్పితే, ఇప్పటివరకు ఎలాంటి మరమ్మతు పనులు చేపట్టలేదని గ్రామస్థులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రామాయంపేట- సిద్దిపేట మార్గంలో

రామాయంపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని రామాయంపేట - సిద్దిపేట వైపు వెళ్లే ప్రధాన రహదారిపై ఏర్పడిన అడుగు లోతు గుంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంతను పూడ్చే బదులు, మున్సిపల్ సిబ్బంది హెచ్చరికగా గుంత పక్కన బండరాళ్లను పాతారు. ఇది గుంత కంటే ప్రమాదకరంగా మారిందని, రాత్రి వేళల్లో ఈ రాళ్లను ఢీకొని ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు.

దెబ్బతిన్న వంతెనలు

టేక్మాల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని గుండువాగు, కలేవాగు వంతెనలు దెబ్బతిన్నాయి. టేక్మాల్ నుంచి జోగిపేట, హైదరాబాద్‌కు గుండువాగు వంతెనపై ఇనుప చువ్వలు తేలాయి. టేక్మాల్ శివారులోని కలేవాగు వంతెనపై ఉన్న తారు రోడ్డు కోతకు గురై, వంతెనపై గుంత ఏర్పడింది.

ఖేడ్-బీదర్ జాతీయ రహదారిపై

నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్-బీదర్ 161బీ జాతీయ రహదారి అత్యంత ప్రమాదకరంగా మారింది. ఖేడ్ శివారులోని మనూరు క్రాస్ రోడ్స్ నుంచి జగన్నాథ్‌పూర్ వెళ్లే మార్గంలో దారి పక్కన భారీ గోతి ఏర్పడింది. అలాగే, విస్తరణ పనుల కారణంగా దుమ్ము భారీగా లేస్తుండడంతో వాహనదారులు నరకయాతన పడుతున్నారు.

అధ్వానంగా హుస్నాబాద్ రోడ్లు..

హుస్నాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని ఆర్ అండ్‌బీ రహదారులు అధ్వానంగా మారాయి. నిత్యం హుస్నాబాద్-కరీంనగర్ ప్రధాన రహదారిపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. సెయింట్ జోసెఫ్ స్కూల్ ఎదురుగా కల్వర్టు తెగిపోయి, పెద్ద గుంతలు ఏర్పడటంతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నాగారం రోడ్డులోని కస్తూర్బా కాలనీ శివారులో రోడ్డు కోతకు గురైంది. కరీంనగర్ రోడ్డులోని మడద రాములపల్లి వై జంక్షన్ వద్ద సూచిక బోర్డులు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి.

చేర్యాల-కడవేరుగు దారిలో

చేర్యాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కాలంలో వరుసగా కురిసిన వర్షాల కారణంగా సిద్దిపేట జిల్లాలోని చేర్యాల-కడవేరుగు ప్రధాన రహదారి దెబ్బతింది. అడుగడుగునా గుంతలమయం, సైడుబర్మ్‌ల కోతలతో ప్రమాదకరంగా మారింది. గాంధీచౌక్, దుర్గమ్మ దేవాలయం, బాలికల జడ్పీఎస్ఎస్, ఊట్లపల్లి కాలనీకి వెళ్లే చౌరస్తాతోపాటు పలు ప్రదేశాలలో భారీగా గుంతలు ఏర్పడ్డాయి.


రామాయంపేట-సిద్దిపేట రహదారి మధ్యలో


దెబ్బతిన్న చేర్యాల- కడవేరుగు దారి


టేక్మాల్ : కలేవాగు వంతెనపై గుంత

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

● మరొకరికి తీవ్ర గాయాలు


బాలమణి (ఫైల్)

చేగుంట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తల్లి మృతిచెందగా, కొడుకుకు తీవ్ర గాయాలైన సంఘటన నార్సింగ్ శివారులోని 44వ జాతీయ రహదారి వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చేగుంట మండలం వల్లభాపూర్ గ్రామానికి చెందిన తల్లీకొడుకు ముత్త బాలమణి (58), ముత్త రాములు వల్లభాపూర్ నుంచి ద్విచక్ర వాహనంపై రామాయంపేటలోని ఆసుపత్రికి వెళ్తున్నారు. నార్సింగి శివారులోని 44వ జాతీయ రహదారి వద్ద గుర్తు తెలియని వాహనం వారిని ఢీకొనడంతో బాలమణి కిందపడి అక్కడికక్కడే మృతిచెందింది. ఆమెపై నుంచి వాహనాలు వెళ్లడంతో మృతదేహం నుజ్జునుజ్జయింది. రాములుకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు నార్సింగ్ ఎస్ఐ సృజన కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో హనుమాన్ మాలధారుడు..


లాలాగౌడ్ (ఫైల్)

రామాయంపేట, నవంబర్ 11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో హనుమాన్ మాలధారుడు మృతి చెందిన సంఘటన రామాయంపేట పట్టణంలో చోటుచేసుకున్నది. వివరాలు ఇలా ఉన్నాయి. రామాయంపేట ఉమ్మడి మండలం నస్కల్ ప్రాంతానికి చెందిన బక్కన్న గారి లాలాగౌడ్(53) రామాయంపేటలో స్థిరపడ్డాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆయన సరిగా నడవకపోవడంతో ఇటీవల స్థానికంగా హోటల్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో ఆయన మంగళవారం ఉదయం హోటల్‌ను శుభ్రం చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై కుప్పకూలిపోయారు. అతనితోపాటు ఉన్న మరో మాలధారుడు వినయ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే ఆసుపత్రికి తరలించగా లాలాగౌడ్ అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. సీఐ బాలరాజు, సీఐ వెంకట రాజాగౌడ్, ఎస్సై బాల్‌రాజు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ బెట్టింగ్‌లో నష్టాలు..

● యువకుడి ఆత్మహత్య


అఖిల్ (ఫైల్)

రామచంద్రాపురం టౌన్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ బెట్టింగ్‌లో నష్టాలు రావడంతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ జగన్నాథ్ తెలిపిన వివరాల ప్రకారం... కడపకు చెందిన సంగీతరావు 30 ఏళ్ల క్రితం రామచంద్రాపురం సాయినగర్‌లో స్థిరపడి, ఇంజనీరింగ్ వర్క్‌షాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన కుమారుడు అఖిల్(30) చదువు పూర్తయిన తర్వాత వర్క్‌షాపును చూసుకునేవాడు. అయితే, అఖిల్ క్రికెట్ బెట్టింగ్‌కు బానిసై సుమారు రూ.6 లక్షల వరకు పోగొట్టుకున్నాడు. దీనికోసం అప్పులు కూడా చేశాడు. అప్పులు పెరగడం, బెట్టింగ్‌లో డబ్బులు పోతుండడంతో మనస్తాపానికి గురై బీరంగూడ కమాన్ పక్కనే ఉన్న ఓ లాడ్జిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం


వడ్డె నాగవ్వ (ఫైల్)

కల్హేర్/సిర్గాపూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): సిర్గాపూర్ మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులో మంగళవారం వృద్ధురాలి మృతదేహం లభ్యమైంది. సిర్గాపూర్ ఎస్ఐ మహేష్ తెలిపిన వివరాల ప్రకారం... ప్రాజెక్టులోని గంగమ్మ దేవాలయం సమీపంలో నీటిలో తేలిన మహిళ మృతదేహాన్ని మత్స్యకారులు, స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసి సిర్గాపూర్ మండలం బొక్కస్‌గామ్ గ్రామానికి చెందిన ఒడ్డె నాగవ్వ(70)గా గుర్తించారు. మతిస్థిమితం సరిగా లేని నాగవ్వ జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందా, లేక స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు జారిపడి మరణించిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు నాగవ్వ సోదరుడు పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

'ఆపదలో అంబులెన్స్'పై ఇంటెలిజెన్స్ ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 'ఆపదలో అంబులెన్స్' శీర్షికతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనంపై ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. నారాయణఖేడ్ ఏరియా వైద్యశాల ఆవరణలో నిలిచిపోయిన అంబులెన్స్ వాహనం, ఖేడ్ వైద్యశాలకు సంబంధించి మాజీ ఎమ్మెల్సీ భూపాల్ రెడ్డి ఇచ్చిన ఓమ్ని అంబులెన్స్ ఎక్కడ ఉంది అనే విషయాలతో పాటు 108 వాహనాల పరిస్థితిపై కూడా ఇంటెలిజెన్స్ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. ఈ సమాచారాన్ని ప్రభుత్వానికి నివేదించినట్లు సమాచారం.

నేడు 'యోగా' ఎంపికలు

సిద్దిపేట రూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఉమ్మడి జిల్లా స్థాయి యోగా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య తెలిపారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ సెలక్షన్‌లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల పాఠశాలల్లోని విద్యార్థులకు అండర్-14, 17 కేటగిరిలో సెలక్షన్‌లు ఉంటాయని తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు ఆధార్ కార్డు, ఒరిజినల్ బోనఫైడ్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు పీడీ సతీష్ 9948110433, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య 9949494748లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు

మూడు ఇళ్లల్లో చోరీ

● రూ.1.20 లక్షలు, నగలు అపహరణ

పుల్కల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం సుల్తానాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. మూడు ఇళ్లు, ఒక అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. పుల్కల్ ఎస్ఐ ఎన్. విశ్వజన్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మన్నె బాల్‌రాజ్, చంటి కిష్టమ్మ, మన్నె కమలమ్మ ఇళ్లతో పాటు అంగన్‌వాడీ కేంద్రంలో దొంగలు చొరబడ్డారు. మన్నె బాల్‌రాజ్ ఇంట్లో రూ.లక్ష నగదు, రెండు బంగారు రింగులు, చంటి కిష్టమ్మ ఇంట్లో రూ.20 వేల నగదు, ఐదు తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. అయితే, మన్నె కమలమ్మ ఇల్లు, అంగన్‌వాడీ కేంద్రం తాళాలు పగులగొట్టి చొరబడినప్పటికీ, ఎలాంటి వస్తువులూ అపహరించలేదు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని జోగిపేట సీఐ అనిల్‌కుమార్ సందర్శించారు.


రవళిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ సునీత

జాతీయస్థాయి సైక్లింగ్ పోటీలకు రవళి

సిద్దిపేట కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి సైక్లింగ్ పోటీలకు సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్ పచ్చిమట్ల రవళి ఎంపికైంది. తెలంగాణ సైక్లింగ్ అసోసియేషన్, రంగారెడ్డి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నవంబరు 1, 2 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలలో రవళి 3వ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.సునీత రవళిని అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ కేర్ టేకర్ బి. కృష్ణయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డా. పి. అయోధ్య రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డా. గోపాల సుదర్శనం, కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డా. సీహెచ్ మధుసూదన్, ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ జి.బాలకిషన్, కోచ్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలలో కుళ్లిన గుడ్లు

హత్నూర, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హత్నూర మండలం ముచ్చర్ల అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం గర్భిణులకు కుళ్లిపోయిన గుడ్లు వచ్చాయి. గతంలో మధుర అంగన్‌వాడీ కేంద్రంలో కూడా పిల్లలకు సరఫరా చేసే సమయంలో కుళ్లిన గుడ్లు వచ్చిన విషయం తెలిసిందే. ఇలా తరుచూ నాసిరకం సరుకుల సరఫరాతో చిన్నారుల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతుండడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణ కొరవడడం తోనే ఇలా ఘటనలు చేసుకుంటున్నాయనే ఆరోపణలున్నాయి. ఈ విషయమై జోగిపేట సీడీపీవో ప్రియాంకను వివరణ కోరగా కుళ్లిన గుడ్లు, నాసిరకం సరుకుల పంపిణీపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇదివరకే ఇలాంటి ఫిర్యాదులు వస్తే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి కాంట్రాక్టర్లను మార్పించామని పేర్కొన్నారు.


ముచ్చర్ల అంగన్‌వాడీ సెంటర్‌లో కుళ్లిన గుడ్లు

అందెశ్రీకి నివాళి



ప్రముఖ కవి, రచయిత అందెశ్రీ స్మారకార్థం, నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్ గుండు శివకుమార్ రావి ఆకుపై ఆయన చిత్రాన్ని వేసి నివాళులర్పించారు.

- నారాయణఖేడ్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి):

కుక్కల వేట

(5వ పేజీ తరువాయి)

ముందుకు వేయలేదు. అక్కడక్కడ మాత్రం కొన్ని కుక్కలకు శస్త్రచికిత్స చేసినా నిధుల లోపంతో వెనక్కుతగ్గారు. ఓవైపు కుక్కలు స్వైరవిహారం చేస్తూ అమాయకులను గాయపరుస్తుంటే వాటిని అరికట్టడానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. కుక్కల సంఖ్యను లెక్కించి కాగితాలకే పరిమితం చేశారు. కానీ, వాటికి జనన నియంత్రణ ఆపరేషన్లు చేయించలేకపోయారు. ఒక కుక్కకు ఆపరేషన్ చేయించాలంటే రూ.1,500 ఖర్చవుతుంది. గ్రామపంచాయతీల్లో డబ్బులు లేకపోవడంతో చాలా గ్రామాల్లో వెనక్కుతగ్గారు. నిరంతరం ఆదాయం వచ్చే మున్సిపాలిటీలు సైతం నిర్లక్ష్యం చూపాయి. దీంతో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా కుక్కలు విజృంభిస్తున్నాయి.

సంక్షిప్తం

దేశిని చిన్న మల్లయ్య ఆశయాలను కొనసాగిస్తాం: పొన్నం

హుస్నాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఇందుర్తి మాజీ ఎమ్మెల్యే దివంగత దేశిని చిన్న మల్లయ్య ఆశయాలను కొనసాగిస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం దేశిని చిన్న మల్లయ్య వర్ధంతి సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్న మల్లయ్య ఈ ప్రాంతానికే కాకుండా యావత్ తెలంగాణ రాష్ట్రానికి ఆదర్శమన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. దేశిని మల్లయ్య వారసుడిగా ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు.

మోడల్ స్కూల్లో అసిస్టెంట్ కుక్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

కొండపాక, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కొండపాక లోని మోడల్ స్కూల్ బాలికల హాస్టల్‌లో పనిచేయడం కోసం ఖాళీగా ఉన్న రెండు అసిస్టెంట్ కుక్ పోస్టులకు ఆసక్తి కల వారు దరఖాస్తు చేసుకోవాలని మండల ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 12నుంచి 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అసిస్టెంట్ కుక్ పోస్టుకు ఏడో తరగతి పాసై ఉండాన్నారు. అభ్యర్థులు మండలానికి చెందినవారై ఉండి, వయస్సు 18 నుంచి 45ఏళ్ల లోపు ఉండాలని తెలిపారు. ఆసక్తి అర్హత గల వారు మోడల్ స్కూల్‌లోని బాలికల హాస్టల్ స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

డీసీసీబీలో పొదుపు చేస్తే అత్యధిక వడ్డీ

ములుగు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో పొదుపు చేస్తే అత్యధిక వడ్డీని పొందవచ్చునని బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ములుగు మండల పరిధి వంటిమామిడిలోని డీసీసీబీ బ్రాంచ్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీసీసీబీ నూతనంగా ప్రవేశపెట్టిన స్వర్ణనిధి డిపాజిట్ ద్వారా 444 రోజులకుగాను అత్యధికంగా 8.25 శాతం వడ్డీని పొందవచ్చన్నారు. డిపాజిట్లపై డీఐసీజీసీ ఇన్సూరెన్స్ సదుపాయంతో పాటు యూపీఐ, మొబైల్ బ్యాంకింగ్, బ్యాంక్ గ్యారంటీ, ఏటీఎం, లాకరు సౌకర్యాన్ని ఖాతాదారులకు అందిస్తున్నామని తెలిపారు. అతి తక్కువ వడ్డీకి స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతో పాటు బంగారు ఆభరణాలపై అత్యధికంగా గ్రాముకి రూ. 7400 రుణాన్ని అందిస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గుండెపోటుతో వ్యవసాయశాఖ ఉద్యోగి మృతి



అన్నబోయిన సుందరయ్య (ఫైల్)

అక్కన్నపేట, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ డివిజన్ వ్యవసాయ శాఖలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న అన్నబోయిన సుందరయ్య(59) మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. మండలంలోని జనగామ గ్రామానికి చెందిన సుందరయ్య 1988లో గ్రామ సర్పంచ్‌గా, 2001లో ఎంపీటీసీగా గెలిచి గ్రామాభివృద్ధికి కృషి చేశారు. సుందరయ్య తండ్రి మల్లయ్య స్వతంత్ర సమరయోధుడు, గతంలో ఆయన కూడా గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. సుందరయ్య మృతదేహాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, సీపీఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వ్యవసాయ శాఖ ఉద్యోగులు, పలు పార్టీల నాయకులు సందర్శించి నివాళులర్పించారు. సుందరయ్యకు భార్య లీల, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఘనంగా రైతు దినోత్సవం



రైతు వేషధారణతో కూరగాయలు విక్రయిస్తున్న చిన్నారులు

చేర్యాల, నవంబరు 11(ఆంధ్ర జ్యోతి): చేర్యాల పట్టణంలోని పంచతంత్ర పాఠశాలలో మంగళవారం రైతుదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు రైతు వేషధారణతో కూరగాయలు విక్రయించారు. రైతు సాగు, విక్రయాల పట్ల పాఠశాల యాజమాన్యం చిన్నారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థులకు రైతుల సాధక బాధకాలపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు.

ఈ దారికి మోక్షమెన్నడో?

- అధ్వానంగా గుర్రాలసోఫా - నాచారం, ఎల్కల్ - వెంకటాపూర్ రోడ్లు
- ఏళ్లు గడిచినా మరమ్మతులు కరువు
- గుంతలు పడి కంకర తేలడంతో నిలిచిన బస్సు సౌకర్యం
- ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని స్థితి
- ఎమ్మెల్యేలు మారినా ఫలితం శూన్యం



రాయపోల్ మండలం వడ్డెపల్లి వద్ద చిన్నపాటి వర్షానికే రోడ్డు పరిస్థితి ఇలా (ఫైల్)





దెబ్బతిన్న గుర్రాల సోఫా - చాచారం రోడ్డు, ధ్వంసమైన ఎల్కల్ - బంగ్లవెంకటాపూర్ రోడ్డు

రాయపోల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తారు రోడ్లపై గుంతలు పడి ఏళ్ల గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. పాలకులు మారినా రోడ్ల రూపురేఖలు మాత్రం మారడంలేదు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్లపై వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే... రాయపోల్ మండలం గుర్రాలసోఫా నుంచి వర్గల్ మండలం నాచారం వరకు సుమారు 12 కిలోమీటర్ల రహదారిపై గతంలో తారు రోడ్డు నిర్మించారు. ఏళ్ల గడిచినా మరమ్మతులు చేయక పోవడంతో రోడ్డుపై గుంతలు పడి, కంకర తేలి అధ్వానంగా మారింది.

రోడ్డు సరిగా లేక బస్సు బంద్

గతంలో దుబ్బాక నుంచి రామారం, వడ్డెపల్లి, బేగంపేట, నాచారం మీదుగా తూప్రాన్ వరకు అక్కడి నుంచి సికింద్రాబాద్‌కు ఓ బస్సు నడిచేది. రోడ్డు దెబ్బతిన్నదన్న కారణంతో సుమారు 6 నెలల క్రితం ఉన్న ఒక్క బస్సునూ నిలిపివేశారు. కంకర తేలి గుంతలు పడిన రోడ్డుపై వెళ్లేందుకు ప్రయాణికులు సైతం నరకయాతన పడుతున్నారు.

పాలకులు మారినా..

ఎమ్మెల్యేలు మారినా, ప్రభుత్వాలు మారినా ఈ రోడ్డు మరమ్మతుకు మాత్రం నోచుకోవడంలేదు. అలాగే ఎల్కల్, బేగంపేట గ్రామాలు దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్నప్పటికీ గజ్వేల్‌కు కేవలం 10 కిలోమీటర్ల దూరంలో ఉంటాయి. అయితే ఎల్కల్ గ్రామానికి రెండు కిలోమీటర్ల సమీపంలో ఉన్న బంగ్ల వెంకటాపూర్ గ్రామం గజ్వేల్ నియోజకవర్గం పరిధిలోకి రావడం, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం కావడంతో ఆ గ్రామం వరకు రోడ్డు బాగు చేసి వదిలేశారు. మరో నాలుగు కిలోమీటర్లు రోడ్డును బాగు చేస్తే, బేగంపేట వరకు ప్రయాణికుల ఇబ్బందులు తప్పేవి. కానీ ఈ గ్రామాలు దుబ్బాక నియోజకవర్గంలో పరిధిలోనివి కావడంతో ఎవరూ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలా ఉండగా దుబ్బాక నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు మారినప్పటికీ రోడ్డు దుస్థితి మాత్రం మారలేదు. ఈ రోడ్డు బాగు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఎమ్మెల్యేలు, అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. ఇప్పటికైనా ఈ రోడ్డును బాగు చేయించి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం



మైనార్టీ బాలుర గురుకుల రెసిడెన్షియల్ స్కూల్‌లో మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

సిద్దిపేట కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని విద్యాసంస్థల్లో మంగళవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతదేశపు మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి రోజునే జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకోవడం తెలిసిందే. కాగా సిద్దిపేటలోని తెలంగాణ మైనార్టీ బాలుర గురుకుల రెసిడెన్షియల్ స్కూల్, కాలేజ్, తెలంగాణ మైనార్టీ బాలికల గురుకుల రెసిడెన్షియల్ స్కూల్, కాలేజ్‌లో వేడుకలను వేర్వేరుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు జాతీయ ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యం, దేశభక్తిని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవం పురస్కరించుకుని ఉత్తమ పనితీరు కనబర్చిన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్‌కి మెమోంటో అందజేసి శాలువాతో సత్కరించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. పరిశోధన, అభివృద్ధి విభాగం కన్వీనర్ డాక్టర్ గోపాల సుదర్శనం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత ముఖ్య అతిథిగా, డాక్టర్ ఖలీం మొహియుద్దీన్ ప్రధాన వక్తగా పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ గణపతిరావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమం లో కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటేశ్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండపోచమ్మ ఆలయ వార్షికోత్సవాలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జగదేవ్‌పూర్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తీగుల్‌నర్సాపూర్‌లోని కొండపోచమ్మ అమ్మవారి ఆలయంలో 24వ వార్షిక వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. రెండో రోజు మంగళవారం అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ అనుగీత అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. హవనము, మూలమంత్ర హోమము, స్థాపిత దేవత పూజ, సామూహిక కుంకుమార్చన వంటి కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం శివపార్వతుల కల్యాణోత్సవంతో ఈ ఉత్సవాలు ముగియనున్నాయి.

బీసీ ఆక్రోశ సభ కరపత్రం ఆవిష్కరణ

గజ్వేల్ రూరల్ నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలు చేయాలని కోరుతూ బీసీ రిజర్వేషన్ల సాధన సమితి, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీల ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న బీసీ ఆక్రోశ సభ కరపత్రాన్ని గజ్వేల్ అంబేడ్కర్ చౌరస్తా వద్ద ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీసీ రిజర్వేషన్ల విషయంలో జాతీయ, రాష్ట్ర పార్టీల వైఖరిని నిరసిస్తూ ఈ సభ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు యువజన నాయకులు, డీబీఎఫ్, ఎంఈఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

ధాన్యం డబ్బులు వెంటనే చెల్లించాలి



పాలమాకులలో విలేకరులతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

నంగునూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యానికి వెంటనే డబ్బులు చెల్లించాలని మాజీ ఎంపీపీ లు జాప శ్రీకాంత్‌రెడ్డి, రాగుల సారయ్య డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పాలమాకులలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 20 రోజులు గడిచినా ఇప్పటివరకు రైతులు అమ్మిన ధాన్యానికి ప్రభుత్వం డబ్బులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. మండలం వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యానికి డబ్బులు రాకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రైతులకు సకాలంలో ఎరువులు అందించడంతో పాటు, సమయానికి రైతులకు పెట్టుబడి కింద రైతుబంధు అందించి ఆదుకున్నదని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతులు పంటలు పండించుకోవాలంటే ఎరువుల కోసం, ధాన్యం అమ్మడం కోసం అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీ పథకాల అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు సమావేశంలో నాయకులు వేణు చక్రవర్తి ,రంగు రాజు గౌడ్, చెలికాని మల్లేశం, కొల వీరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సీపీ ద్వారా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న విఘ్నేశ్వరి

వ్యాసరచన పోటీల్లో ఆదర్శ పాఠశాల విద్యార్థిని జిల్లా ఫస్ట్

దౌల్తాబాద్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా పోలీస్ శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో దౌల్తాబాద్ ఆదర్శ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని విఘ్నేశ్వరి ప్రథమ స్థానంలో నిలిచిందని ప్రిన్సిపాల్ దుర్గాప్రసాద్ తెలిపారు. మంగళవారం జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సీపీ విజయ్ కుమార్ విఘ్నేశ్వరికి ప్రశంసాపత్రం, మెమెంటోను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్ వ్యాసరచన పోటీల్లో విఘ్నేశ్వరి ప్రథమ స్థానంలో నిలవడం పాఠశాలకు ఎంతో గౌరవ కారణమని హర్షం వ్యక్తం చేశారు.

మెనూ పాటించాలి: డీఈవో



మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలిస్తున్న డీఈవో

సిద్దిపేట కల్చరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రూమ్ టు రీడ్ ఓరియంటేషన్ కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటలోని బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. భోజనం ఎలావుందని విద్యార్థులను అడిగి తెలుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న చెకుముకి టాలెంట్ పరీక్ష నిర్వాహణను పరిశీలించారు. డీఈవో వెంట సెక్టోరియల్ ఆఫీసర్ రంగనాథ్, ప్రధానోపాధ్యాయుడు మనోహర్ ఉన్నారు.

విద్యార్థులకు పోటీలు

టిసాట్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి జిల్లా విద్యాధికారి శ్రీనివాసరెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

హుస్నాబాద్ చెరువులకు కొత్తశోభ!


(5వ పేజీ తరువాయి)

పునరుద్ధరణ, చెరువులో పెరిగిన చెట్లను తొలగించే పనులు చేపడతారు. ఈ పనులు కూడా త్వరలో ప్రారంభం కానున్నాయి.

కొత్త చెరువుకు రూ. 8.50 కోట్లతో ప్రతిపాదనలు

హుస్నాబాద్-సిద్దిపేట నేషనల్ హైవేలో ఉన్న కొత్త చెరువు అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం ఇరిగేషన్ అధికారులు రూ. 8.50 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపారు. ఈ నిధులతో చెరువు మత్తడి వద్ద బ్రిడ్జి నిర్మాణం, రైలింగ్, పారాపిట్ వాల్ (అడ్డుగోడ), డ్రైనేజీ, పచ్చిక, ప్రస్తుతం 5 మీటర్లు ఉన్న కట్టను 8 మీటర్లకు వెడల్పు చేయడం, విద్యుత్ దీపాలు ఏర్పాటు వంటి సుందరీకరణ పనులు చేయనున్నారు. ఈ నిధుల మంజూరు విషయంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నిధులు కూడా త్వరలోనే మంజూరవుతాయని ఆశాభావం వ్యక్తమవుతోంది. రూ. 18 కోట్ల వ్యయంతో ఎల్లమ్మ చెరువు అభివృద్ధి జరుగుతుండగా, పల్లె చెరువుకు నిధులు మంజూరై, కొత్త చెరువుకు ప్రతిపాదనలు పంపడం పట్ల ఈ మూడు చెరువుల ప్రాంత ప్రజలు, పట్టణవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అందె శ్రీకి ఘన నివాళి



హుస్నాబాద్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్/చేర్యాల/కోహెడ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజాకవి అందెశ్రీ అంతిమయాత్రను మంగళవారం మేడ్చల్- మల్కాజ్‌గిరి జిల్లా ఘట్‌కేసర్‌లో నిర్వహించగా జిల్లానుంచి అభిమానులు, నాయకులు, సాహితీవేత్తలు తరలివెళ్లారు. కాగా ఆయన మృతి పట్ల జిల్లాలో పలువురు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమంలో ఆయన పాత్రను గుర్తు చేసుకున్నారు. పలుచోట్ల అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. హుస్నాబాద్, కోహెడ, చేర్యాల మండలాల్లో సంతాపసూచకంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు.



కోహెడలో అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యువకులు. నాయకులు



అందెశ్రీ అంతిమయాత్రలో చేర్యాల మండల నాయకులు

డ్రంకెన్‌డ్రైవ్‌లో 8 మందికి జరిమానా.. ఒకరికి జైలు

గజ్వేల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): గజ్వేల్ పట్టణంలోని వివిధ కూడళ్లలో ఇటీవల పోలీసులు నిర్వహించిన డ్రంకెన్‌డ్రైవ్‌లో 9 మంది పట్టుబడ్డారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టగా 8 మందికి జరిమానా, ఒకరికి జైలుశిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు చెప్పారు. గజ్వేల్ ట్రాఫిక్ సీఐ ఎం. మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడినవారిని మంగళవారం గజ్వేల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ మూల స్వాతిగౌడ్ ఎదుట కోర్టులో హాజరుపరచగా, విచారణ అనంతరం 8 మందికి రూ.80వేల జరిమానా విధించారు. ఒకరికి 3 రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పును వెలువరించినట్టు సీఐ తెలిపారు.

43 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

సిద్దిపేట రూరల్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మంగళవారం సిద్దిపేట రూరల్ ఎస్ఐ కె.రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణరావుపేట మండలం బంజేరుపల్లి గ్రామ శివారులో గల ఆకుల పరంధాములు వ్యవసాయ భూమిలో రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు పోలీసులకు విశ్వసనీయంగా సమాచారమందడంతో దాడి చేసి పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బదునకల్ గ్రామానికి చెందిన చింతల నగేష్ అనే వ్యక్తి చుట్టు పక్కల గ్రామాల్లోని రేషన్ లబ్దిదారుల నుంచి 43 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి నిల్వ చేశాడు. ఈ మేరకు బియ్యం స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు.

సిద్దిపేటలో దాబా సీజ్

సిద్దిపేట క్రైం నవంబర్ 11(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలోని వేములవాడ కమాన్ ఎక్స్‌రోడ్ పక్కన ఉన్న గాయత్రి ధాబాను పోలీసులు, మున్సిపాలిటీ అధికారులు సీజ్ చేశారు. టూ టౌన్ ఇన్‌చార్జి సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. గాయత్రి ధాబాలో మద్యం సేవిస్తున్నట్టు పోలీసులకు సమాచారమందడంతో తనిఖీలు చేశారు. ఈ క్రమంలో దాబా యజమాని శ్రీనివాస్, ధాబాలో పనిచేసే వ్యక్తి బికాస్ తో కలిసి మద్యం సేవిస్తుండగా అదుపులోకి తీసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశారు. మంగళవారం పోలీసులు మున్సిపల్ కమిషనర్ లేఖ పంపగా కమిషనర్ దాబాని సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆసిఫ్, ఎస్ఐ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ ఇంటి వద్ద న్యూసెన్స్.. వ్యక్తి అరెస్ట్

సిద్దిపేట క్రైం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఇంటిముందు న్యూసెన్స్ చేసిన వ్యక్తిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇన్‌చార్జి సీఐ వాసుదేవరావు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేటలో నరసాపూర్ గ్రామంలోని ఓ మహిళ ఇంటి ముందు భర్త లేని విషయం తెలుసుకొని అదే గ్రామానికి చెందిన గొల్ల రాకేష్ ఇంటి బయట గడియ పెట్టి, కరెంట్ తీసేసి న్యూసెన్స్ చేశాడు. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో నరసాపూర్ గ్రామంలో మంగళవారం నిందితుడిని అతడి ఇంటి వద్దే అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు

వ్యాపారులు సామగ్రిని రోడ్డుపై పెట్టవద్దు



గజ్వేల్‌లో దుకాణాల ముందు సామగ్రిని తొలగింపజేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

గజ్వేల్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు సామగ్రిని రోడ్డుపై పెట్టవద్దని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సుమన్‌కుమార్ సూచించారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా రోడ్లలో దుకాణాల ముందు ఫుట్‌పాత్‌లను ఆక్రమించి రోడ్డుపై సామగ్రిని పెట్టి వాహనదారులకు ఇబ్బందులు కల్పిస్తున్న యజమానులకు, వ్యాపారులకు సీఐ మురళీతో కలసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లపై ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలిగించేలా అడ్వర్‌టైజ్‌మెంట్ బోర్డులను, సైన్ బోర్డులను, సామాగ్రిని పెట్టవద్దని సూచించారు. అదేవిధంగా మద్యం సేవించి ఎట్టి పరిస్థితిలో వాహనాలను నడుపవద్దని సిద్దిపేట ట్రాఫిక్ ఏసీపీ సూచించారు. గజ్వేల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపిన పలువురు వాహనదారులకు ట్రాఫిక్ సీఐ మురళి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని, రాంగ్‌రూట్లో వాహనాలను నడుపవద్దని సూచించారు. అనంతరం ట్రాఫిక్ సిబ్బందితో ఇంటారిక్టివ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారితో ట్రాఫిక్ ఎస్ఐ నీరేశ్, ఏఎస్ఐలు జగదీశ్వర్, కుమారస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై ఆక్రమణల తొలగింపు



రోడ్డుపై ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

కుకునూరుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కుకునూరుపల్లి మండల కేంద్రంలో రోడ్డుకి ఇరువైపులా, ఫుట్‌పాత్‌లపై ఏర్పాటు చేసిన పలు దుకాణాలను, రేకులషెడ్‌లను పోలీసులు తొలగించారు. మంగళవారం కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన దుకాణాలను, రేకులను తొలగించారు. గత మూడు రోజుల క్రితం వాహనాన్ని మరో వాహనం ఓవర్‌టేక్ చేసే క్రమంలో ప్రమాదం సంభవించింది. రోడ్డు పక్కన ఉన్న దుకాణాలు అడ్డు రావడంతో వాహనాన్ని అదుపు చేయడం వీలు కాక ప్రమాదం సంభవించి పలువురికి గాయాలయ్యాయి. భారీ బందోబస్తు మధ్య ఆక్రమణలను పోలీసులు తొలగించారు.

ఇంటర్ ఉచిత విద్యకు జక్కాపూర్ విద్యార్థులు

సిద్దిపేట రూరల్,నవంబరు 11(ఆంధ్రజ్యోతి); సదిశ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ జోన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ఇంటర్ ఉచిత కార్పొరేట్ విద్య కోసం నిర్వహించిన అర్హత పరీక్షలో తమ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు నారాయణరావుపేట మండలం జక్కాపూర్ పీఎంశ్రీ జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు కొమ్మూరి పద్మ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా కొమ్మూరి పద్మ మాట్లాడుతూ కరీంనగర్ జోన్ పరిధి నుంచి 2వేల మంది విద్యార్థులు అర్హత పోటీ పరీక్షలో పాల్గొనగా జక్కాపూర్ పాఠశాల విద్యార్థులు కారంకంటి రోహిత్, బోయిని నందిని లు ఉచిత కార్పొరేట్ విద్యకు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కరీంనగర్ జోన్‌లో 36 మందికి, తెలంగాణ వ్యాప్తంగా 79 మంది విద్యార్థులకు ఈ ఫౌండేషన్ ద్వారా ఉచిత ఇంటర్ విద్య లభించనుందని చెప్పారు. ఈ పరీక్షలో అర్హత సాధించడానికి కృషి చేసిన గణిత ఉపాధ్యాయులు మట్ట మట్టారెడ్డి, పాతురి తిరుపతిలను ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ ప్రతిభ చూపాలి



క్రీడల ప్రారంభోత్సవంలో విద్యార్థులతో ఆర్సీవో రాజేశం, ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి

వర్గల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చదువులతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల ఆర్సీవో రాజేశం పేర్కొన్నారు. మంగళవారం వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో జిల్లాస్థాయి అండర్ 14 క్రీడ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్సీవో మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలోనూ ప్రతిభ చూపినట్లయితే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అనంతరం గౌరారం ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడల వల్ల మానసికోల్లాసం పాటు శారీరక దారుఢ్యాన్ని పొందవచ్చన్నారు. అనంతరం వాలీబాల్, కబడ్డీ ఆటలతో క్రీడలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీదేవి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.